# లక్ష్యం సాధించే వరకు విశ్రమించొద్దు


ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాగారం నాయకులు

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 18 : తాము అనుకున్న లక్ష్యం చేరే వరకు యువత విశ్రమించొద్దని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూచించారు. ఐటీ హబ్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం 500ల మంది యువతీ, యువకులకు టెక్ విజన్, షాప్డ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు శిక్షణ ఇస్తున్న తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్‌ను జగదీశ్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయత్నం చేయకుండా ఏది మన సొంతం కాదని తమ లక్ష్యం సాధించేంత వరకు రాజీలేకుండా చేసే కృషి చేయాలన్నారు. యువత ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అన్నారు. భావి ఇంజినీర్లుగా తమను తాము తీర్చిదిద్దుకునేందుకు సూర్యాపేటలో టాస్క్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులందరి ప్రయత్నం సక్సెస్ కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌లో శిక్షణ పొందిన కార్పొరేట్ కంపెనీల్లో సంవత్సరానికి రూ.20,15 లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించిన యువతులకు మంత్రి అభినందనలు తెలిపారు. విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడంలో ప్రధాన భూమిక అయిన ల్యాప్‌టాప్‌లను ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థ సీజీఐ స్పాన్సర్ చేయగా వాటిని టాస్క్ సంస్థకు జగదీశ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సాఫ్ట్ వేర్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు కొణతం సైదిరెడ్డి, యలక గోపిరెడ్డి, కొండపల్లి పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న బీఆర్ఎస్ నాయకుడు

బొడ్రాయిబజార్: సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మూడోసారి గెలుపొందిన సందర్భంగా తమిళనాడులోని వేలంగిని మేరీమాత ఆలయానికి మోకాళ్లపై నడిచి మొక్కు తీర్చుకున్నాడు బీఆర్ఎస్ క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు పూర్ణశశికాంత్. సోమవారం ఉదయం ప్రధాన ఆలయంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కొరకు ఫాదర్ జోసఫ్‌చే కృతజ్ఞత ప్రార్థనలు చేయించారు.


మోకాళ్లపై నడిచి మొక్కు తీర్చుకుంటున్న పూర్ణశశికాంత్

## ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

నాగారం : సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మూడోసారి గెలుపొందిన సందర్భంగా సోమవారం మండలంలోని పేరబోయినగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో సన్మానించి అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, ఉప సర్పంచ్ కడారి సత్తయ్య, తీగుళ్ల ప్రశాంత్, దొడ్డి ప్రేమయ్య, కంచికట్ల లింగయ్య, సుకుమార్, సంతోష్, మధు పాల్గొన్నారు.

## నేడు అయ్యప్ప మహా పడిపూజ

సూర్యాపేటటౌన్, డిసెంబర్ 18 : సూర్యాపేటలో క్యాంపు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 7 గంటలకు నిర్వహించనున్న అయ్యప్ప మహా పడి పూజ మహోత్సవం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అయ్యప్ప, శివ, మాలధారులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి : తాసీల్దార్

నూతనకల్, డిసెంబర్ 18 : పద్దెనిమిదేండ్లు నిండిన యువతి, యువకులందరికీ ఓటు హక్కు కల్పించాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు సూచించారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో మృతి చెందిన వారి పేర్లు తొలగించాలన్నారు. ఓటరుకార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని ఆయన తెలిపారు. డిసెంబర్ 30 వ తేదీ వరకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీధర్, బీఎల్ఓలు ఉన్నారు.

## 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

నూతనకల్, డిసెంబర్ 18 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, చికెన్ గున్యా, డెంగూ, ఫైలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు తారమ్మ, మాణిక్యమ్మ, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనుముల రవీందర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్



ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 18 : ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వెంకట్రావ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డితో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు అక్కడే పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మీసేవా కేంద్రాల్లో ధరల పట్టిక ఉంచాలని ఆదేశించారు. మీసేవా కేంద్రా ల్లో వసూళ్లపై అధికంగా ఫిర్యాదుల అందుతున్నాయని చెప్పారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం కోసం ఆరుగురు సీనియర్ అధికారులను నియమించామన్నారు. వారి సమక్షంలో ఆర్జీలు పరిశీలన అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రజావాణికి అధికారులు హాజరుకావాలని సూచించారు. ప్రజావాణికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే వారికి షోకాజ్ నోటీసులు అందించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,426 స్కూల్స్‌ను తనిఖీ చేశామని చెప్పారు. త్వరలోనే కళాశాలలు, వసతి గృహాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేస్తామని చెప్పారు. జిల్లా అభివృద్ధి నివేదికలు వెంటనే సీపీఓకు అందించాలన్నారు. రెవెన్యూ శాఖకు 29 దరఖాస్తులు రాగా ఇతర శాలకు 20 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సురేశ్, డీఆర్‌డీవో కిరణ్‌కుమార్, డీఏఓ రామరావునాయక్, డీపీఓ యాదయ్య, డీఈఓ అశోక్‌పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మండల విద్యాధికారులు, సీపీడీఎల్ సభ్యులతో తొలి మెట్టు లక్ష్యం కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత అభ్యసన అభివృద్ధి కార్యక్రమాన్ని 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పటిష్టంగా అమలు జరగాలన్నారు. క్షేత్ర స్థాయి వరకు కార్యక్రమం ఉద్దేశాలను తీసుకువెళ్లి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. మూడో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశంలో వారు లెవనేత్తే సమస్యలు పాఠశాల పరంగా తీసుకోవాల్సిన చర్యలు పేటీఎం రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు అభ్యసన పరంగా ఏ సబ్జెక్టు లో ఇబ్బందులు పడుతున్నారో పేటీఎం రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు సన్మానం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు టీఎన్‌జీఓలు కలెక్టర్ వెంకట్రావ్‌ను సన్మానించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ కలిసి కట్టుగా పనిచేయడం వల్ల ఎన్నికలు విజయవంతమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు జానిమియా, దున్న శ్యాం, ఆకాశ్ వర్మ, అనంతరాములు పాల్గొన్నారు.

# తుంగతుర్తిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే మందుల సామేల్


అడ్డగూడూరు: ధర్మారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, డిసెంబర్ 18: తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత స్వగ్రామం ధర్మారం మొదటిసారిగా సోమవారం వచ్చారు. అంతకు ముందు అడ్డగూడూరు మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు ఎడ్లబండిని పూలతో అలంకరించి ఇంటి వరకు తీసుకువచ్చారు.ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏండ్ల కష్టానికి ప్రతిఫలం దక్కిందని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలో రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఇండ్ల నిర్మాణానికి , ప్రభుత్వం నిర్మించే సీసీ రోడ్లు, భవనాలకు మాత్రమే ఇసుకను ఉపయోగించాలని తెలిపారు. మారుమూల గ్రామంలో పుట్టి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మండలాధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య యాదవ్, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, ఇటికాల చిరంజీవి, చేడే చంద్రయ్య, జోజి, బొమ్మగాని లక్ష్మయ్య, గూడెపు పాండు, మత్స్య రెడ్డి, వల్లంభట్ల రవీందర్ పాల్గొన్నారు.

### నేడు తుంగతుర్తికి ఎమ్మెల్యే సామేల్ రాక

తుంగతుర్తి :మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు ఎంపీడీఓ భీమాసింగ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం


సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 18 : సుబ్రమణ్య షష్ఠి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 5గంటలకు ఆశ్లేష బలి, సర్ప బలిహరణ పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి అనంతరం శ్రీ వల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రెంటాల సతీశ్ శర్మ వేద మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాలతో నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణతంతు నిర్వహించారు. మధ్యాహ్నం మాలధారణ భక్తులు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. రాత్రి 7గంటలకు వివాహం కాని యువతీ యువకుల కోసం ప్రత్యేక సర్పాకార దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల కమిటీ, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన


మోత్కూరు: పాటిమట్లలో ఉన్నతి రికార్డులను పరిశీలన చేస్తున్నజిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్

మోత్కూరు, డిసెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన జరగనుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ప్రభుత్వ సదుపాయాలను వినియోగించేకోవడంతో భవిష్యత్‌లో మరింతగా రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి గోపాల్‌రెడ్డి, సీఎంఓ లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అగ్గి రాములు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.